36.

# జగత్తుకు మూలాధారం భగవంతుడే

సకల విద్యలు నేర్చి సభ జయించగ వచ్చు
శూరుడై రణమున పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగ వచ్చు
హేమ గోదానముల్ యీయవచ్చు
గగనంపు చుక్కలు గణియింపగా వచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగ విద్యల నన్ని నేర్వగవచ్చు
చంద్రమండల యాత్ర సలుపవచ్చు
కాని దేహేంద్రియముల నరికట్టి
మనసు నిల్పియు నంతర్ముఖము చేసి
అనవరతము నిశ్చల సమాన చిత్తుడై
నిలువలేడు ఈనాటి మానవుండు

ప్రేమస్వరూపులారా!

**మూడు శక్తులు**

ఈ ప్రాకృతమైన ప్రపంచమందు ప్రతి మానవుడు ఏ చిన్నకార్యము సాధించవలెనన్నను దీనికి యిచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి మూడుశక్తులు అత్యవసరము. ఇచ్ఛాశక్తి అనగా ఒక పని చేయాలని సంకల్పించటం. అయితే ఆ పని ఏవిధంగా చేయాలి? ఏపరిస్థితిలో చేయాలి, ఎలాంటి మార్గము ననుసరించాలి అనే విచారణశక్తి అత్యవసరము. ఈ యిచ్ఛాశక్తి, జ్ఞానశక్తి ఉండినంత మాత్రమున కార్యము సాఫల్యమవుతుందా? కాదు. ఇది వస్త్రము. ఈ వస్త్రాన్ని తయారు చెయ్యాలి. అయితే దీనికి ప్రత్తి కావాలి. నేసే మగ్గము కావాలి. ఈ అన్ని పరికములను విచారణ చేయటమే ఈ జ్ఞానశక్తి. నిత్యానిత్య విషయ పరిశీలనా శక్తి తనయందున్నది. చెయ్యాలనే యిచ్ఛాశక్తి తనయందున్నది. కానీ

srisathyasaivachanamrutam

చేయటమనే కార్యము ప్రారంభించినప్పుడే యీ మూడింటి ఏకత్వము స్వరూపాన్ని ధరిస్తుంది. యిచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి మూడు ఉండినంత మాత్రము ఈ కార్యము సంపూర్ణముగా నెరవేరదు. దీనికి ఒక చిన్న ఉదా: 1. పూలు, సూది దారముంది పుష్పమాల తానగునా, 2. ప్రమిద, నూనె, వత్తి గలదు దీపపు వెల్గు కల్గునా. దీనిని కూర్చేవారు ఒకరు ఉండాలి. దీనిని చేర్చేవారు ఒకరుండాలి. ఈ వ్యక్తి లేక యీమూడు లభించి ప్రయోజనముండదు. కనుక యిచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి మూడింటిచేత ఒక దానిని నిర్మించటానికి ప్రయత్నించవచ్చు. కానీ చేసే వ్యక్తి ఒకడు ఉండాలి. ఆ చేసే వ్యక్తి లేనప్పుడు ఏమాత్రము ఉపయోగము ఉండదు. 3. బంగారు కలదు, రత్నాలు కలవు. నగలు నిర్మాణమగునా? దీన్ని చేసే కంసాలి ఒకడు ఉండాలి కదా!

**భగవంతుడే ఉపాదాన కారకుడు**

రెండు కారణాలు. దీనినే ఉపాదానకారణము, నిమిత్త కారణము అని రెండు కారణాలుంటున్నాయి. అన్నింటికి అధిపతి యైనవాడు ఒకడు ఉపాదాన కారణము. క్రియాకారణము ఒకటి ఉండాలి. ఈ క్రియా కారకుడు భౌతికమైన జగత్తుకు ఒక ఆదర్శమునందిస్తుంటాడు. ఒక కంసాలి అనేక విధములైన ఆభరణములు సృష్టిస్తాడు. కానీ బంగారం ఎవరు సృష్టించారు? ఈ బంగారమును సృష్టించిన వాడే ఉపాదానకారకుడు. ఈ బంగారమును ఒక నగగా సృష్టించిన వాడే క్రియాకారకుడు. ప్రత్తిని ఎవరు సృష్టించారు? భగవంతుడు సృష్టించాడు. దానిని ఒక దారముగా చేసి వస్త్రముగా చేయటం ఒక సాలెవాడు. కనుక నిమిత్త కారకుడు జగత్తుకు ఆదర్శంగా ఉంటున్నాడు. కంసాలి నిమిత్త కారకుడు. కానీ ఉపాదాన కారణమైన భగవంతుడే లేకుండిన యీ నిమిత్త కారకుడు ఏమీ చేయలేడు. ఉపాదాన కారకుడైన భగవంతుడే జగత్తునంతా సృష్టించాడు. ఈ సృష్టించిన జగత్తును నిమిత్తకారణుడైన మానవుడు అనుభవించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఉపాదాన కారకుని యీనాడు మరిచిపోయారు. నిమిత్త కారకుడే ప్రధానమని విశ్వసించి నేను చేశాను, నేను చూచాను, నేను చెప్పాను అనే అహంకారమునకు గురౌతున్నారు. మూలాధారమైన

srisathyasaivachanamrutam

పదార్థము ఒకటి ఉండినప్పుడే యీ నిమిత్తకారకుడు అనేకవిధములైన సృష్టించి, భావించగలడు. సైన్సు పిల్లలకు తెలుసు. ఆక్సిజను, హైడ్రోజనులు ఉన్నాయి. ఆక్సిజను ఒక భాగము, రెండు భాగములు హైడ్రోజను చేర్చి నీరుగా సృష్టించాడు. నేను సృష్టించాను నీరుని అని విఱ్ఱవీగుతున్నాడు యీ విద్యార్థి. హైడ్రోజను, ఆక్సిజను ఎవరు సృష్టించారు. ఈ మూలాధార పదార్థముల నాధారము చేసుకొనియే లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతమైన వస్తువులను తాను తయారుచేసుకో గల్గుతున్నాడు. కానీ యీ ఆధునిక యుగమందు ఈ భౌతికమైన, లౌకికమైన క్రియాస్వరూపాన్నే ఆధారముగా తీసుకుంటున్నారు గానీ మూలాధారమైన వస్తువును తాను ఆధారముగా తీసుకోటం లేదు. ఒక కుమ్మరి ఉన్నాడు. వాడు కుండలు చేయాలని సంకల్పించుకున్నాడు. సంకల్పించుకున్నంత మాత్రమున కుండలు కావు. ఏవిధంగా చేయాలనే విధి విధానాన్ని తాను చింతించాడు. ఈ చింతించినంత మాత్రమున కుండలు తయారు కావు. ప్రవేశించి అందులో పాల్గొని క్రియారూపము ధరించాడు. కుండ తయారైంది. ఈ కుండ కంటె కుమ్మరి వేరుగా ఉంటున్నాడు. కానీ మట్టి, కుండ రెండు వేరు కాలేదు. ఈ కుండలోనే మట్టి ఉన్నది. మట్టిలోనే కుండ ఉన్నది. వీటిని విడదీయటానికి వీలు లేదు. కనుక ఈ కుమ్మరి కేవలము నిమిత్త కారకుడే గానీ మూలాధార కారకుడు కాదు. ఈ మూలాధార కారకుడే ఉపాదాన కారకుడు. అతనే దైవము. ఆ దైవము సృష్టి చేత సర్వకార్యములలో విజయము సాధిస్తున్నాడు.

**జీవరాసులు**

మన భారతదేశమందు వేదాంత పరిభాషయందు మానవజాతి 84 లక్షల జీవరాసులున్నాయి అని ఉచ్చరిస్తూ వచ్చింది. 84 లక్షల జీవరాసులు ఏవిధంగా తయారయ్యాయి. అండజములు 21 లక్షలు. పిండజములు 21 లక్షలు, స్వేదజములు 21 లక్షలు, ఉద్భిజము 21 లక్షలు. ఈ నాలుగు చేరి 84 లక్షల జీవరాసులైనాయి. అండజమనగా ఏమిటి? గుడ్డులో నుండి జన్మించటము. దీనిలో అనేక జీవరాసులుంటున్నాయి. కేవలం పక్షులే కాదు. క్రిమికీటకాదులే కాదు. సర్పము, తేలు ఇత్యాది విషజంతువులు కూడా గుడ్ల నుండే ఆవిర్భవిస్తున్నాయి. 'జ' అనగా పుట్టటము.

srisathyasaivachanamrutam

గుడ్లనుండి పుట్టినవి అండజమన్నారు. పిండజ అనగా గర్భమునుండి ఉద్భవించిన వాటిని పిండజము అంటారు. యివి 21 లక్షల రకము లుంటున్నాయి శ్వేదజములు. మన swet నుండి పుట్టినవి 21 లక్షలుంటున్నాయి. ఋద్భుజము అనగా భూమి నుండి పుట్టినవి 21 లక్షలు. గుడ్లనుండి పుట్టినవి 21 లక్షలు. చెమటనుండి పుట్టినవి 21 లక్షలు. గర్భము నుండి పుట్టినవి 21 లక్షలు. ఈ నాల్గింటి ఏకత్వమే 84 లక్షల జీవరాసులు.

**ఏకత్వమే జీవత్వము**

అన్నింటినుండి ఏకత్వమే అదే జీవతత్వము. విశాలమైన సముద్రము ఉన్నాది. అనంతమైన సముద్రములో అనంత అలలయందు అనేక రూపనామములచేత అలలు ఉద్భవిస్తున్నాయి. ఒక తరంగముండినట్టు మరొక తరంగము లేదు. కానీ యీ తరంగములు ఒకదానికొకటి సంబంధము లేదు కానీ అన్నింటికి సముద్రమే మూలాధారము. అలలు మాత్రం వివిధ రూపనామములు ధరిస్తున్నాయి. అదే విధముగా అండజ, పిండజ, స్వేదజ, ఋద్భుజ అనే యీ నాలుగు 84 లక్షల జీవరాసులు కూడా ఒక్క సచ్చిదానందమనే సముద్రమునుండే ఆవిర్భవిస్తున్నాయి. అన్నీ సచ్చిదానందమునుండే ఆవిర్భవిస్తున్నాయి. సచ్చిదానందము అనగా ఏమిటి? సత్ - being ఎప్పటికీ ఉండేది. మార్పు చెందనిది. కూర్పుచెందనిది నిరంతరము ఉండేది. అదియే సత్ అన్నారు. ఎప్పటికి ఉంటున్నాది. చిత్ అనగా పరిపూర్ణమైన జ్ఞానతత్వమే. ఈ పరిపూర్ణ జ్ఞానము ఎప్పటికి మార్పు చెందేది కాదు. నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం ఇదే నిజమైన చిత్. ఈ చిత్ అనే దానికి సత్ అనేది ప్రతిబింబముగా ఉంటున్నాది. ఈ రెండింటి ఏకత్వము చేతనే ఆనందము అనేది ఆవిర్భవిస్తున్నది. సత్ sugar వంటిది. చిత్ చైతన్యముతో కూడిన జలము వంటిది. ఇది చిత్ యిది సత్. సత్ చిత్ రెండు ఏకము చేసినప్పుడే ఆనంద స్వరూపాన్ని ధరిస్తున్నాది. ఈ sugar, water రెండు చేరినప్పుడు సిరప్ అనే రూపాన్ని ధరిస్తుంది. సత్ చిత్ రెండూ చేరినప్పుడు ఆనందము ఆవిర్భవిస్తుంది.

**తాను ఎక్కడ అని వెతకటమే వెర్రితనము**

సర్వజీవులయందు, సర్వప్రాణుల యందు ఈ సత్ చిత్ ఆనందము స్వరూపకంగానే

srisathyasaivachanamrutam

ఉంటున్నది. కానీ స్వస్వరూపాన్ని తాను దర్శించుకొనలేక విచారించుకొనలేక స్వస్వరూపము ఎక్కడో ఉన్నదని వెతుకుతున్నాడు వెఱ్ఱి మానవుడు. ఇది ఏవిధంగా ఉన్నదనగా తనను తాను ఎక్కడో వెతుక్కోటానికి పోతున్నాడు. తనను తాను ఎక్కడ వెతకగలడు. తనయందే వెతుక్కోవాలి. తనను తాను వెతికే వెఱ్ఱివాడు ఏ స్థానమునందు తనను తాను గుర్తించుకోలేడు. ఒక చిన్న ఉదాహరణము. జాగ్రదవస్థయందు తాను సంచరించినట్టుగా, సంభాషించి నట్టుగా, స్నేహం చేసినట్టుగా, ఆనందము అనుభవించినట్టుగా అనుభవిస్తాడు. అయితే యీ ప్రత్యక్షమునకు నాలుగు ప్రమాణములుంటున్నవి. కాలకర్మకారణ కర్తవ్యములు. యిక్కడనుండి బెంగుళూరు పోవాలి. సంకల్పించుకున్నాడు. సంకల్పించుకున్న తక్షణమే కారు తెప్పించుకున్నాడు. కారులో కూర్చున్నాడు. 3 గంటలు ప్రయాణము చేశాడు. బెంగుళూరు చేరాడు. కాలము ఎప్పుడు తెల్లవారి 5 గం॥లకు బయలు దేరాడు. 5 గం॥లకు బయలుదేరి 8 గం॥లకు బెంగుళూరు చేరాడు. దేనిలో చేరాడు? కారులో చేరాడు. ప్రారంభకాలము 5'o clock. చేరటము 8'o clock. దేనిలో ప్రయాణము. కారులో ప్రయాణము. కారణము దేనికోసం పోయాడు. అక్కడ ఏదో ఒక ప్రోగ్రాము ఉన్నాది. ఆ ప్రోగ్రాము కోసం వెళ్లాడు. కాలము, కర్మ ప్రయాణం చేయటం మూడుగంటలు, కారణము ప్రోగ్రాము, కర్తవ్యము అనుభవించటము. ఈ కాల కర్మ కారణ కర్తవ్యములతో చేరినదే సత్యము. ఇదే అనుభూతి. రాత్రి భుజించి పరుండిన తర్వాత పది గంటలకు స్వప్నం వచ్చింది. ఆ స్వప్నములో బెంగుళూరు నీవు పోయినట్లుగా అక్కడ నీ కార్యక్రమాలు విజయము గావించినట్లుగా స్వప్నం వచ్చింది. స్వప్నము నిజమే అనుకుంటున్నావు. కానీ యిందులో కాల కర్మ కారణ కర్తవ్యాలు లేవు. ఎప్పుడు బయలుదేరావు తెలీదు. ఏమి చేశావు తెలీదు. యిది స్వప్నావస్థలో కాల కర్మ కారణ కర్తవ్యాలు ఏవీ లేవు. జాగ్రదావస్థలో ఆవిధంగా ఉంది. స్వప్నం యీ విధంగా ఉంది. సుషుప్తి అనగా గాఢనిద్ర. గాఢనిద్రలో ఏ కారణము, ఏ కర్తవ్యము, ఏ కర్మ ఆచరించలేదు. కానీ ఆనందము అనుభవిస్తున్నావు. ఈ ఆనందము ఎక్కడ నుండి వచ్చింది. జాగ్రత్తలో నీ శరీరముతో, నీ కాయముతో సర్వ కర్మలు నీవు ఆచరిస్తున్నావు. స్వప్నావస్థలో నీ దేహాన్ని నీవు సృష్టించు కుంటున్నావు. నీ స్వప్న దృశ్యములన్నీ నీవే

sri sathyasai vahini amrutam

సృష్టించుకుంటున్నావు. నీ కోరికలన్నీ నీవే సృష్టించుకుంటున్నావు. నీ ప్రయాణము నీవే సృష్టించుకుంటున్నావు. ఈ సుఖదుఃఖాలు నీకు నీవే అనుభవిస్తున్నావు. ఆ ప్రయాణములో ఆ రోడ్డు నీకు ఎక్కడ నుంచి వచ్చింది. ఆ కారు ఎక్కడ నుండి తెచ్చావు. ఇవన్నీ నీకు నీవే సృష్టించుకున్నావు. స్వప్నావస్థలో అన్నింటికి తానే సృష్టికర్త అయినాడు. జాగ్రదవస్థయందు ప్రత్యేకమైన విభాగములుగా వ్యక్తులుగా, వస్తువులుగా సృష్టించుకుంటున్నాడు. సుషుప్తియందు ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. అయితే జాగ్రత యందు అనుభవించినది తానే, స్వప్నమునందు అనుభవించినది తానే, సుషుప్తియందు ఆనందమును అనుభవించేది తానే. ఈమూడు కాలములందు మూడు రూపాలు ధరించలేదు. మూడు కాలములందు ఒక వ్యక్తియే ఈ అనుభవములనందుకుంటున్నాడు. కనుకనే త్రికాల బాధ్యమైన వాడు మానవుడు. మూడు కాలములందు మార్పుచెందక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అనుభూతిగా ఆనందమును అనుభవించేవాడు మానవుడే. కనుక మానవుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడే. ఇతడే నిజమైన దైవస్వరూపము. ఈ త్రికాలములందు ఏకత్వాన్ని దర్శించినవాడు మానవుడే. త్రిలోకములందు సంచరించేవాడు మానవుడే. కనుక ఉద్భవించిటము, అనుభవించటము, ఆనందించటము మానవునియొక్క స్వస్వరూపమే. యిలాంటి ఏకత్వము తాను గుర్తింపచేసుకోటానికి ప్రయత్నించి నప్పుడు మానవత్వములో ఎట్టి విధములైన కలతలుగానీ, కల్లోలములుగానీ ఆవిర్భవించుటకు అవకాశము లేదు.

**త్రివిధ పాపములు**

**త్రిగుణం త్రిదళాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం**

అన్నారు, శంకరులవారు. ఈశ్వరతత్వాన్ని చక్కగా వర్ణిస్తూ వచ్చారు. దేహాభి మానము ఉండినంతవరకు భిన్న అభిమానములు ఆవిర్భవిస్తుంటాయి. శంకరుల వారు కాశీ క్షేత్రాన్ని చేరారు. అక్కడకు వెళ్లి విశ్వనాథుని దర్శించారు. అక్కడ ప్రార్థిస్తున్నాడు ఆదిశంకరులు. స్వామీ! నేను ఎందుకోసం యిక్కడ చేరాను? నేను మూడు విధములైన పాపములు చేశాను. ఈ మూడు పాపముల పరిహార నిమిత్తమై నిన్ను దర్శించటానికి వచ్చాను. ఏ పాపం చేశాడు.

srisathyasaivachanamrutam

ఎవరిని చంపాడు, ఎవరిని హింసించాడు, ఏమి దొంగిలించాడు, ఏ సొత్తు అపహరించాడు. ఏమీ చేయలేదే. పాపి అని ఎట్లా చెప్పాడు. మొదట పాపం చెబుతున్నాను వినండి అన్నాడు. “యధోవాచా నివర్తంతే అప్రాప్య మనసా సహః” అని నేను వ్రాసాను. భగవంతుని వాక్కుచేత గానీ, మనస్సుచేత గానీ వర్ణించుటకు సాధ్యం కాదు అని నేనే తెల్పాను. అలా చెప్పిన నేను నిన్ను యిక్కడకు వచ్చి వర్ణిస్తున్నాను. నేను చెప్పినది ఒకటి చేసినది మరొకటి. ఇది పాపం కాదా ఈ పాపాన్ని క్షమించమని ప్రార్థించాడు. భగవంతు డెక్కడ ఉన్నాడు?

**సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్**
**సర్వతః శృతి ముల్లోకే సర్వమా వృత్యతిష్ఠతి**

ఎక్కడ చూచినా భగవంతుడున్నాడని వర్ణించాడు. సర్వభూతములందు నేనే ఉంటున్నానని వర్ణించాడు.

**ఈశ గిరీశ నరేశ పన్నగ భూషవిభో**
**సాంబసదాశివ శంభో శంకర**
**శరణం దేవ తవ చరణయుగం**

నిన్ను అనేక రకములుగా వర్ణించాను ఈశ్వరా. భగవంతుడు ఎక్కడ చూచినా ఉన్నాడని వర్ణించాను. కానీ కాశీక్షేత్రమునకు నిన్ను దర్శించటానికి వచ్చాను. నేను వర్ణించుట ఒకటి, అనుభవించుట మరొకటి. ఇది పాపం కాదా! నేను చెప్పినది ఒకటి, చేసినది మరొకటి. భగవంతుడు హృదయవాసి అని చెప్పాను. అన్నిచోట్లా ఉన్నాడు. అన్ని చోట్ల ఉన్న భగవంతుని నేను ప్రయాణం చేసి చూడటం ఎందుకు? నేను కాశీక్షేత్రమునకు వచ్చి చేరాను. పాపం కాదా? మరణమే లేదు మానవునకు అని నేను వర్ణించాను. నపాపం నపుణ్యం నసౌఖ్యం నదుఃఖం అన్నాను. అలాంటి నేనే ఈ శరీరముతో యీ పాపము పరిహారము చేయమని ప్రార్థిస్తున్నాను. పాపము పరిహారము చేయమని కోరటం పాపం కాదా! నేనే భగవంతుడనిన నేను యింక పాపము ఎక్కడ చేశాను. నపాపం నపుణ్యం నదుఃఖం నసుఖం. యిట్టి వర్ణించిన నాలుక తిరిగి నేను పాపపరిహారం కోసం దర్శించటానికి వచ్చానంటే యిది ఒక పెద్ద పాపం. శంకరుని బోధయందున్న అంతరార్థము ఏమనగా



srisathyasaivachanamrutam

## ఆదిశంకరుల ఆదర్శము

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్**

ఈ మనోవాక్కాయ కర్మల ఏకత్వమే నిజమైన ఆత్మతత్త్వము. "మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్" చెడ్డవాడై పోవటానికి కారణం ఏమిటి? మనస్సులో సంకల్పము ఒకటి. మాటలో మరొకటి. చేతలలో యింకొకటి. The proper study of mankind is man. మనస్సు, మాట, చేత ఈ మూడింటి ఏకత్వము కాలేదు. ఇది పెద్ద పాపము. అని ప్రపంచమునకు బోధించే నిమిత్తమై ఆదిశంకరుల వారు యావిధమైన యాత్ర చేస్తూ వచ్చారు. శంకరులు చేసినది ప్రతి అడుగు అడుగు ఒక్కొక్క ఉపదేశమే. ఆ కాశీ క్షేత్రము నుండి వెనుకకు వస్తున్నాడు. ఎవరో ఒకరు చెట్టు క్రింద కూర్చొని దుకృఞ్కరణే-దుకృఞ్కరణే అని పాణిగ్రంథమును ఉచ్ఛరిస్తున్నాడు. చూచాడు వానికి ఒక బోధ చేయాలి. 'నాయనా! ఏమిటి నీవు వల్లిస్తున్నావు?' 'పాణిని వ్యాకరణము వల్లిస్తున్నాను' అన్నాడు. 'దీనివల్ల కలిగే ఫలితము ఏమిటి' అడిగాడు. 'నేను ఉండినంత వరకు నాకుటుంబముతో బాటు సుఖంగా జీవిస్తాను' అన్నాడు. 'ఎంత వరకు జీవిస్తావు!' 'ఈ శరీరముతో జీవించినంత వరకు'. 'తదుపరి' 'నాకు తెలీదు' అన్నాడు. అప్పుడు చెప్పాడు 'పిచ్చివాడా భౌతికమైన దేహము, భౌతికమైన ధనము, భౌతికమైన జగత్తు, భౌతికమైన గ్రంథము, ఇవన్నీ భౌతికమైనవి. యివి ఉండినంత వరకు నీవు ఆనందిస్తావు. నీవు మరణించిన తరువాత ఆనందించే శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన ఆనందము మొట్టమొదట నీవు సంపాయించుకోమన్నాడు.

**భజగోవిందం భజగోవిందం**
**గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే**
**నహినహి రక్షతి దుకృఞ్కరణే**

ఈ దుకృఞ్కరణే నహినహి రక్షతి. ఎప్పటికి పాండిత్యము నిన్ను రక్షించలేదు. ఈ గ్రామరు, ఈ చదువులు నిన్ను రక్షిస్తాయా? మానవత్వములో నున్న దివ్యత్వమును యీ విద్యలన్నీ

sri sathyasaivachanamrutam

నిర్మూలము గావిస్తున్నాయి. ఈ knowledge ని divine knowledge గా మార్చుకోటానికి ప్రయత్నం చేయి. ఈ విద్యలు శాశ్వతమైనవి కావు. ఎంతకాలం ఉంటాయి. క్షణభంగురమైనవి. ఇలాంటి విద్యలో కాలమునంతా వ్యర్థము చేసి జీవితము నిరర్థకము చేసుకోవద్దు. ఈవిధంగా శంకరుల వారికి అవసరము లేనప్పటికిని తాను అన్నీ లోకోద్ధార నిమిత్తమై, లోక కళ్యాణ నిమిత్తమై లోకజ్ఞానాన్ని అందించే నిమిత్తమై సర్వకర్మలు ఆచరిస్తూ వచ్చాడు. శంకరుల వారు మాత్రమే కాదు. కృష్ణుడు కూడా అట్లానే చేశాడు. ఏమి చెప్పాడు.

**నమే పార్థాసి కర్తవ్యం త్రిషు లోకేషు కించనా**
**నాన వాప్త మవాప్తవ్యం వర్త ఏ వచ కర్మణి**

**కర్మ యొక్క విశిష్ఠత**

నేను ఈ ముల్లోకములలో చేయవలసిన పని ఏమి లేదు. ఈ ముల్లోకములలో నాకు వచ్చే ఫలితము ఏదీ లేదు. కానీ తెల్లవారి మొదలు రాత్రి పరుండినంతవరకు కర్మలాచరిస్తున్నాను. దేనికోసం? ఎవరికోసం? ఎందుకోసం? లోకోద్ధారణనిమిత్తమై. పెద్దలను చూచి పిల్లలు అనుసరించటానికి అవకాశము ఉంటుంది. ఇతరులు నన్ను అనుసరించి తద్వారా తరించుటకు ప్రయత్నం చేస్తున్నారు. నేనే కర్మలు ఆచరిస్తున్నాను. నీవు కూడా కర్మలు ఆచరించు. ఈ కర్మ చేతనే నీ జన్మ సార్థకమవుతుంది.

**"కర్మణ్యేవ అధికారస్తే మాఫలేషు కదాచన". "కర్మానుబంధీని మనుష్యలోకే".** మనుష్యలోకమంతా కర్మచేత బంధింపబడింది. కర్మ చేయకుండా ఎవరు కాలము వ్యర్థము చేయటానికి వీలులేదు. చాలా మంది విదేశీయులను నేను ఏపని చేస్తున్నావని అడిగినప్పుడు నేనేమి పని చేయటం లేదంటాడు. పని అనగా ఈనాటి మానవుడు ఏమని భావిస్తున్నాడు? ఏదో ఒక ఉద్యోగమనో, వ్యాపారమనో, యింకే విధమైన పని అనో భావిస్తున్నారు. ఇది కాదు కర్మ. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడా కర్మయే. మన కన్నులు ఆడుతున్నాయి. ఇదంతా కర్మయే. భోజనం చేస్తున్నాం. చేతికి నోటికి పని పెడుతున్నాం. ఇదంతా కర్మయే. తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండునంత వరకు యీ దేహము కర్మాచరణ యందే ఉంటున్నది. కానీ యీ కర్మలు సార్థకమైన కర్మలుగా చేయటం చాలా ఉత్తమమైనది.

srisathyasaivachanamrutam

**నవవిధ పూజలు**

పూజలు చేయవచ్చు. నవ విధములైన పూజలుంటున్నాయి ఏవిధంగా-

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం**

ఈ తొమ్మిది కర్మలే. అయితే ఎందుకోసం నీవు ధ్యానం చేస్తున్నావు? ఎవరికోసం చేస్తున్నావు. దీనివల్ల కలిగే ఫలితము ఏమిటి? విచారణ చేస్తే దీనికి ఒకే ఒక జవాబు. ధ్యానం చేసినా, తపము చేసినా యజ్ఞం చేసినా, యాగము చేసినా అన్నీ కూడా మీకోసం మీరు చేసుకుంటున్నారే గానీ భగవంతుని కోసం కానే కాదు. భగవంతుని కెందుకు ఇవన్నీ నీతృప్తి నిమిత్తమై నీవు ఆచరిస్తున్నావు. నీతృప్తి కోసమే జపం చేస్తున్నావు. అంతేగానీ దీనివల్ల భగవంతునికి ఏ ఫలితము లేదు. భగవంతుని కోసం నేను యీ పూజ చేస్తున్నాను అనుకుంటారు. కాదు చాలా పొరపాటు. మానవులు చేసేదంతా స్వార్థము కోసమనే ఏది చెప్పినా కానీ వెనుక స్వార్థమనేది కదులుతూనే ఉంటున్నాది. ఎక్కడ నడచినా వెనుక స్వార్థము కనిపిస్తున్నాది. ఏమి చెప్పినా స్వార్థము కనిపిస్తున్నాది. స్వార్థమనే చేతిలో కీలుబొమ్మగా జీవిస్తున్నాడు మానవుడు. ఈ స్వార్థము లేకుండా ఒక్క అడుగైనా ముందుకు వేయలేడు. స్వార్థము కోసం చేస్తున్నాడే గానీ పరార్థము కోసం కాదు. ఎవరెన్ని చేసినా తమ నిమిత్తమై తాము చేసుకుంటున్నారే గానీ భగవంతుని నిమిత్తము కాదనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ఈ మెడిటేషన్ నీ తృప్తి నిమిత్తమై చేస్తున్నావు. జపము నీ తృప్తి నిమిత్తమై చేస్తున్నావు. భజన నీతృప్తి నిమిత్తమే చేసుకుంటున్నావు. నిస్వార్థముగా చేసిన సాధననే భగవంతునికి చేరుతుంది.

**తానే భగవంతుడు**

ఇవన్నీ స్వార్థము కోసం ఆచరించే ప్రక్రియలే గానీ భగవంతుని కోసం ఆచరించేవి కాదు. ఎందుకనగా తానే భగవంతుడై ఉన్నాడు. సో--హం- తానే భగవంతుడు. నేనే దైవమని తానే ఉచ్ఛరిస్తున్నాడు. కానీ భగవంతుని కోసం ఎందుకు చేయటం ఇవన్నీ? ఎక్కడున్నాడు భగవంతుడు. ఏవిధంగా పట్టాలి అతనిని. ఏవిధంగా దర్శించాలి. ఈవిధమైన

sri sathyasai vachanamrutam

ప్రశ్నలన్నీ అనాది కాలము నుండి నేటివరకు వస్తూనే ఉన్నాయి. కనుక తన తత్వాన్ని తాను గుర్తించుకొనుటకు యీ సాధనలన్నీ చేయాలి. నేనే దైవాన్ని అనే సత్యాన్ని ఎప్పుడు గుర్తిస్తాడో అతడే నిజమైన సాధకుడు. కానీ ఈ సత్యాన్ని గుర్తించుకోకుండ ఎన్ని విధములైన సాధనలు చేసినప్పటికిని యివన్నీ వ్యర్థమైన పనులు నీ సత్యాన్ని నీవు గుర్తించు. ఆ గుర్తించిన సత్యాన్ని పదిమందికి పంచు. పదిమందికి పంచటమే కాక వారితో చేయించు. వారిని కూడా గుర్తించమని బోధించు. ఇదే నీవు చేయవలసిన పని. **"శరీర మాద్యం ఖలు ధర్మసాధకం"**. ఈ ధర్మాన్ని ఆచరించాలి.

**ధర్మాచరణ**

ఏది ధర్మము. **"ధారయతీతి ధర్మః"**. ఏది ధరించిందో అదే ధర్మము. ఏది? ప్రేమయే మన ధర్మము. సత్యమే మన ధర్మము. శాంతమే మన ధర్మము. ఇట్టి స్వధర్మాన్ని తాను ఆచరిస్తూ రావాలి. ఇప్పుడు చక్కెర ఉన్నాది. చక్కెర స్వభావము ఏమిటి? తీపి దీని గుణము. చక్కెరలో తీపి లేకపోతే యిది చక్కెరే కాదు. యిది మట్టి. అగ్ని ఉన్నాది. అగ్నికి దహనశక్తి సహజం. దహన శక్తి లేక బొగ్గు అవుతుంది గానీ అగ్నికాదు. అదే రీతిగా మానవత్వమునకు ఏది సహజము? ప్రేమయే సహజము. ఈ ప్రేమలేక వీడు మానవుడే కాదు. తీపిలేక చక్కెర ఎట్లా కాదో, దహనశక్తి లేక నిప్పు ఎట్లా కాదో మానవునియందు ప్రేమ లేకపోతే మానవుడే కాదు వాడు. ప్రేమఉంది కానీ సమయ సందర్భము పురస్కరించుకొని ప్రేమ ఉపయోగపెడుతున్నాడు. తనబిడ్డ తన దగ్గరకు వస్తే ప్రేమిస్తున్నాడు. భార్యను ప్రేమిస్తున్నాడు. తల్లిని చూచినప్పుడు ప్రేమిస్తున్నాడు. అందరిని ప్రేమిస్తున్నాడు. ఈ ప్రేమ తనలో లేకపోతే ఏవిధంగా ప్రేమించగలడు? బంధుప్రీతి ఉన్నాది.

**బంధువులందరు వాకిటి దాకను వల్లకాటికీ వత్తురు**
**నిన్ను ఎడబాయని ఆపద్బంధువు భగవంతుడు ఒక్కడేనురా**

అట్టి ఆపద్బంధువును విస్మరించి లోకసంబంధమైన బంధువును విశ్వసించి కాలము వ్యర్థము గావిస్తున్నావు.

sri sathyasai vachanamrutam

## జంతూనాం నరజన్మ దుర్లభం

మానవుడా! ఈ మానవత్వాన్ని ధరించినందుకు ఎంతో ధన్యుడు కావాలి. మానవజన్మ చాలా దుర్లభమైనది. అట్టి దుర్లభమైన మానవజన్మను, ఉత్తమమైన మానవజన్మను, ఆదర్శవంతమైన మానవజన్మను, పవిత్రమైన మానవజన్మను, విలువైన మానవజన్మను ఎందుకు నీవు వ్యర్థము చేసుకుంటున్నావు. నీవు పుట్టినందుకు ఒక ఆదర్శమును చూపాలి. ఆదర్శమును నీవు వెతకాలి. ఆదర్శము నీవు అనుసరించాలి. అనుసరించి అందరికి అందించాలి. అంతేగానీ అనేక విధములుగా ప్రపంచసంబంధమైన విషయములలో ప్రవేశించి అన్ని పనులు చేసుకో, తప్పులేదు. కానీ చిత్తమునందు మాత్రము ఆ వృత్తి వదలకుండా ఉండాలి.

## నర్తకి-కీర్తన

ఇదంతా జగన్నాటక రంగములో సూత్రధారి నాట్యధారి. ఇందులో నృత్యము కూడా ఉన్నాది. ప్రతి మానవుడు నృత్యము సల్పుతున్నాడు. ఈ విశ్వనాటక రంగమందు ఈ నర్తకి నాట్యము చేస్తున్నాది. చేతులు తిప్పుతున్నాది. కన్నులు తిప్పుతున్నాది. అభినయం సల్పుతున్నాది. తాళం వేస్తున్నాది. అన్నీ చేసినప్పటికిని తనయొక్క నృత్యమునకు భంగముకాని రీతిగా తాను ప్రవర్తిస్తున్నాది. ఎన్నిసార్లు హస్తములు తిప్పినప్పటికిని, ఎంత అభినయము గావించినా తాళము మాత్రము తప్పకుండా నడుస్తున్నాది. అదేవిధముగా ప్రతిమానవుడు తన వృత్తులు తాను చేసుకోవచ్చు. తన పని తాను చేసుకోవచ్చు. తన ఉద్యోగము తాను సల్పవచ్చు. కానీ అన్నిటియందు దివ్యత్వమనే స్థితి మరువకుండా చూచుకోవాలి. ఈనాటి కాలమందు ఈ నర్తకిని మనం వశం చేసుకోవాలి. ఈనర్తకి ఎట్లా మనకు వశం అవుతుంది. నర్తకి - కీర్తన. నర్తకిని మనం వశం చేసుకోవాలంటే కీర్తన చేయాలి.

**హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్**
**కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా**

మనము కీర్తన చేయాలి. దేనికోసం. నీవే దైవం నిన్ను నీవు కీర్తించుకో. ఎవరిని నీవు

sri sathyasai vachanamrutam

కీర్తించవద్దు. ఎవరి చేత కీర్తిని పొందవద్దు. ఎవరికి నీవు యివ్వవద్దు. ఎవరి దగ్గర తీసుకోవద్దు.

**సాక్షాత్కార మనగా నేమి?**

నీకు నీవుగా ఉండు అదియే సాక్షిభూతం. అదే సాక్షాత్ ఆకారం. కానీ నన్ను నేను చూసుకోవాలి. ప్రత్యక్షంగా అనుభవించాలని ఆశిస్తుంటారు అనేకమంది. దీనిని సాక్షాత్కారము అంటారు. విదేశీయులు liberation అంటున్నారు. Liberation అంటే ఏమిటో, సాక్షాత్కారమంటే ఏమిటో వారికే తెలియదు పాపం. I want liberation. I want సాక్షాత్కారం. ఈ సాక్షాత్కారం ఎంత తప్పు పదం. సాక్షాత్ ఆకారం. అద్దము ఉంది. అద్దము ముందు నుంచున్నావు. ఆకారము చూచి ఆనందిస్తున్నావు చాలా పొరపాటు. నీ అద్దములో చూచునది నీవు కాదు. నీకు భిన్నమైనదిగా ఉంటున్నాది. అద్దములోని ప్రతిబింబము right side left side గా కనిపిస్తుంది. అది సాక్షాత్ ఆకారము ఎట్లా అవుతుంది? నీవు సాక్షాత్ ప్రత్యక్షము ప్రతిబింబము. అది సాక్షాత్కారము కాదు. సాక్షాత్కారము కాని దానిని సాక్షాత్కారముగా భావిస్తున్నావు. నిన్ను నీవు చూచుకోవాలంటే నీ అంతర్భావము వెతకాలి. దేహాభిమానాన్ని త్యజించు. ఆత్మాభిమానాన్ని అభిలషించు. ఈ ఆత్మాభిమానంచేత సాక్షాత్కారం ప్రాప్తిస్తుంది. ఆత్మతత్వాన్ని గుర్తించు. ఇదే నిజమైన మానవత్వములో తెలుసుకోవలసిన విషయము.

**కోహం సోహం**

మానవుడుగా జన్మిస్తున్నాడు. మానవుడుగా పెరుగుతున్నాడు. మానవుడుగా జీవిస్తున్నాడు. మానవుడుగా మరణిస్తున్నాడు. కాదుకాదు. మొట్టమొదట నీవు పుట్టినప్పుడు ఏమని పుట్టావు? కోహం కోహం అని పుట్టావు. 'కోహం' అనగా నేనెవరు నేనెవరు? పుట్టిన ప్రతి బిడ్డ ఏడుస్తుంది కోహం అని. నేనెవరని. చచ్చేంతవరకు కోహం అని పోతుంటే బ్రతికి ప్రయోజనం ఏమిటి? పుట్టే సమయంలో కోహం అని పుట్టావు. సోహం అని చావాలి. ఆ సోహంతో అనగా నేనే దైవము అనే భావముతో చచ్చినవాడే నిజమైన ముక్తుడు. యిదియే నిజమైన liberation. కానీ ప్రపంచములో ఉండినంతవరకు కోహంలోనే పోతుంటే ఎప్పుడు

sri sathyasai vachanamrutam

దీని ఆనందాన్ని స్వస్వరూపాన్ని దర్శించేది. మానవుడు అనేక చింతలతో జీవిస్తున్నాడు. యివన్నీ తనకు తానే కల్పించుకున్నవి.

**పుట్టుట ఒక చింత భూమి నుండుట చింత**
**సంసారమొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత చెడుపు చింత**
**కర్మలన్నియు చింత కష్టంబులొక చింత**
**సంతసమొక చింత ఎంత చింత**

పన్నెండు చింతల చింతచెట్టు క్రింద కూర్చొని నీకు సంతోషము కావాలంటే ఎట్లా నీకు లభిస్తుంది. ఇవన్నీ నీకు నీవు కల్పించుకున్నవే. నీకు భ్రాంతితో అన్ని attach చేసుకున్నవే. ఇది భగవంతుని సృష్టియే కాదు. భగవంతుని gift కాదు. భగవంతుడు ఏదీ gift యివ్వటం లేదు. ఎందుకంటె ఎవరికి యిచ్చేది. తానే భగవంతుడై ఉండగా ఎవరికి యిచ్చేది. నీ భ్రాంతియే సృష్టిస్తున్నాది. భ్రాంతిలో మునిగినంత వరకు బ్రహ్మ మనకు అర్థము కాదు. ఈ భ్రమలో ఉండినంత వరకు బ్రహ్మ మనకు చిక్కడు. భ్రమను దూరం చేసినప్పుడే బ్రహ్మ మనకు చిక్కుతాడు. ఎక్కడో వెతకనక్కరలేదు. తనయందే సాక్షాత్కరిస్తుంది. నిప్పు ఉన్నాది. నిప్పును అలక్ష్యముతో టేబులుపైన పెట్టావు. కొంతకాలమునకు నివురు కప్పింది. అగ్ని కనిపించటం లేదనుకుంటున్నావు. కానీ ఆ నివురు ఎక్కడ నుండి వచ్చింది. నిప్పు నుండి వచ్చింది. నిప్పునుండి పుట్టిన నివురు నిప్పునే కప్పివేసింది. దాన్ని ఊదు. నివురు పోయి నిప్పు కనిపిస్తుంది. సాక్షాత్కారము అది. వాడేముందు ఉన్నటువంటిదే ఆ నిప్పు. అలక్ష్యము చేయటం వలన మాయ అనే నిప్పు కప్పుకుంది. ఆ మాయ అనే నివురు తీసివేస్తే నిప్పు సహజంగా కనిపిస్తుంది. నీవు కొత్తగా సంపాదించినదికాదు. పూర్వము ఉన్నటువంటిదే నీలో ఉన్న తత్వము నీవు గుర్తించుకోటానికి నీయందున్న దేహాభిమానమనే మాయను దూరం చేయాలి. శంకరుల వారు చెప్పారు.

భజగోవిందం అదే నీవు చేయవలసినది. గోవిందం అనగా ఏమిటి? గో అనగా

srisathyasaivaniamrutam

వేదము. గో అనగా గోవు. గో అనగా బ్రాహ్మణుడు. అన్ని కూడా తనయందున్న బ్రహ్మతత్వానికే. వేదముతో కూడినది మానవత్వము. వేదమనగా ఏమిటి? 'అనంతో వైవేదః ' అనంతమైనది వేదము. ఇదే జ్ఞానము.

**జ్ఞానమననేమి**

జ్ఞానమనగా ఏమిటి? అద్వైత దర్శనం జ్ఞానం. రెండు కానిది. ఒక్కటే ఒక్కటి. దీనినే వేదాంత భాషయందు ఏకం సత్ విప్రా బహుదావదంతి. అనేకమంది అనేక పేర్లు పెట్టుకుంటూ వచ్చారు. వారు వారికి తగిన పేర్లు పెట్టుకుంటూ వచ్చారు. ఈ టంబ్లరులో ఏమిటి ఉన్నాది. నీరు. ఇది తెలుగు. తెలుగువారు నీరు అంటారు. ఇంగ్లీషు వారు water అంటారు. హిందీవారు పానీ అంటారు. తమిళ్ వారు తన్ని అంటారు. సంస్కృతము వారు వారి అంటారు. భాషలు వేరు వేరు గానీ నీటిని మార్చలేరు కదా. అదే రీతిగా దైవత్వం ఒక్కటే. ఏకప్రభూకో అనేక నాం. అనేక పేర్లతో మనం పూజిస్తున్నాం. కానీ ఉన్నది ఒక్కటే అదే అహం అహం. దీనినే నేను నేను అంటున్నావు. నేను అనేది మొట్టమొదటి పేరు భగవంతునకు. ఆ నేనునే ఉచ్చరించుకుందాం. కూటికిపేద మొదలు కోటీశ్వరుని వరకు నీవు ఎవరయ్యా అంటే నేను ఫలాన వాడను, నేను ఫలానా వాడను అని నేను లేకుండా ఫలాని వాడని చెప్పటానికి వీలుకాదు. ఆ I. అదే నిజమైన తత్వం. ఈ ఐ లో రెండు విధములైనవి ఉంటున్నాయి. ఏకాక్షర I ఒకటి, three letters eye ఒకటి. ఏకాక్షర I ఆత్మ. Three letters eye దేహము. కాబట్టి దేహము త్రిగుణములతో కూడినది. ఆత్మ ఎట్టి గుణము లేక ఏకత్వంగా ఉండేది. ఎట్టి గుణము లేదు. నిర్గుణం, నిరంజనం, సనాతం, నికేతనం. **బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం, ద్వందాతీతం త్రిగుణ రహితం, తత్వమస్యాది లక్ష్యం ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం భావాతీతం త్రిగుణరహితం.** ఈ I అనే దానికి అన్ని అన్వయిస్తాయి. ఎంతమంది అన్వయించినా యిది ఏకంగానే కనిపిస్తుంది. నిన్న చెప్పాను గణితశాస్త్రములో 1+1+.....నాలుగు, 10, 20, 30 అవుతుంది. కానీ నేను+నేను+....=నేను అయిపోతుంది. కోటి నేనులు చేర్చి పెట్టుకో నేను ఒక్కటే అయిపోతుంది. అందరి యందున్నది నేను అనే ఒక్క అక్షరమే. అదియే సర్వభూతాంతరాత్మ. అదే **'ఈశావాస్య మిదం జగత్'. 'ఏకంసత్ విప్రా బహుదా వదంతి'.**

srisathyasaivachanamrutam

'ఏకాత్మ సర్వభూతాంతరాత్మ' దీనికి ఇన్ని పేర్లుగా పెట్టుకుంటు వచ్చారు.

**ఎవరి నమ్మకం వారిది**

ప్రేమస్వరూపులారా! మీరందరు ప్రేమస్వరూపులే. ప్రేమను మీరు ప్రత్యక్షం చేసుకోండి. మీ ప్రేమను మీరు అనుభవించుకోండి. మీ ఆనందాన్ని మీరు అనుభవించుకోండి. ఎవరు ఏమి చెప్పినా మీరు వాదించకండి. ఏమిట్రా ప్రేమ ప్రేమ అని పిచ్చిలో పడిపోతున్నావంటారు. అయ్యా నా పిచ్చినాది, నీ పిచ్చి నీది. నా desire నాది, నీ desire నీది. నావాంఛ నాది, నీవాంఛ నీది. నా ఆకలి నాది, నీ ఆకలి నీది. నా ఆకలికి నీవు తింటే, నా ఆకలి తీరుతుందా. నా ఆకలికి నేనే తినాలి. నా ఆకలికి నీవు తింటే నా ఆకలి తీరదు. దీనికి ఏమాత్రము అధికారము లేదు. ఎవరైనా కొంతమంది హేళన చేస్తుంటారు. ఏమిటి దేవుడు ఎక్కడున్నాడు? ఎందుకోసం దేవుడు దేవుడని ప్రాకులాడుతున్నావు. అప్పుడు మనం వానికి చెప్పవలసిన జవాబు ఎలాంటిది తెలుసునా? 'అయ్యా నీకు దేవుడంటే నమ్మకము లేకపోవచ్చును. నీకు దేవుడు లేడని చెప్పటానికి ధైర్యం ఉన్నది. అవకాశ మున్నది. కానీ నా దైవము లేడని చెప్పటానికి నీవు ఎవరు? నా దైవము నాకున్నాడు. నీకు లేదని చెప్పటానికి అధికారము లేదు. నీకు లేకపోతే మంచిది. నాకు లేదని చెప్పటానికి అధికారము లేదు. ఆవిధముగా మనం వాదించినప్పుడే సరిగా బుద్ధి కుదురుతుంది. ఎవరి పిచ్చి వారిది. ప్రపంచమంతా పిచ్చాసుపత్రి. పిచ్చాసుపత్రిలో తమకు తాము వర్ణించుకునేవారు కొంతమంది ఉంటారు. యితరులను కొట్టేవారు కొంతమంది ఉంటారు. ఇతరులను తిట్టేవారు కొంతమంది ఉంటారు. అనేక రకములైన పిచ్చి ఆటలు ఆడుతుంటారు. కానీ ఎవరిని ఏమి అనకుండా ఊరకే కూర్చొనే వారి పిచ్చి ఎంత ఉత్తమ పిచ్చి. డాక్టరుకు కూడా ఉపకారంగా ఉంటుంది. అయ్యో! ఈ పిచ్చివాడు ఎంత మంచిగా ఉంటాడు. ఎంత ఉత్తముడు అని ఎంతో ఆనందిస్తారు. లోకమంతా పిచ్చాసుపత్రే. ఒక్కొక్కరికి ఒక్కో పిచ్చిగా ఉంటుంది. కానీ దైవపిచ్చి పట్టటం చాలా గొప్పది. ఈ పిచ్చి చాలా గొప్ప పిచ్చి. దైవపిచ్చిని పట్టించి, ప్రాపంచిక పిచ్చిని పోగొడతాడు భగవంతుడు. దైవపిచ్చి అందరికి రాదు. అదృష్టవంతులకే అది ప్రాప్తిస్తుంది. ఆ పిచ్చి మనకు పడితే చాలా అదృష్టమే. ప్రపంచములో ఉన్నవారికందరికి దైవపిచ్చిపడితే ప్రపంచములో ఈ కల్లోలములే ఉంటుండవు. అప్పుడు మనం శాంతి శాంతి శాంతి అని చెప్పవలసిన అవసరం ఉండదు.



srisathyasaivachanamrutam

ప్రపంచమంతా శాంతిగానే ఉంటుంది. Violence అభివృద్ధి చెందటం చేత మనం శాంతి శాంతి శాంతి అని చెప్పవలసి వస్తుంది. అందరు ఎవరికి వారు ఆనందము అనుభవించండి. దైవము నాయందే ఉన్నాడు. నాదేహము దైవము యొక్క మందిరము. ఆ విశ్వాసముతో మీరు జీవించినప్పుడు తప్పక దేశమంతా శాంతిని పొందుతుంది.

**ప్రేమ ఎప్పుడూ మారకూడదు**

విద్యార్థులారా ప్రేమస్వరూపులారా! నిత్యము భజన అయిన తర్వాత లోకస్సమస్తా సుఖినోభవంతు అంటున్నాం. నిజంగా యిది చెప్పకుండా మీరు చేసుకోండి. ఎందుకంటే లోకమంతా peace గా లేదు ఎక్కడ చూచినా pieces, pieces. No peace. కనుక నీవు శాంతి అని చెప్పవలసిన అవసరం వచ్చింది. మనము శాంతిగా ప్రేమతో అందరియందు సహజభావముతో సంచరించి నప్పుడు 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' చెప్పనక్కరలేదు. లోకమంతా శాంతిగానే ఉంటుంది. నీ ప్రేమ పెంచు. దినానికి పదిమందికైనా నీ ప్రేమను పెంచు. ఈ విధంగా share చేసుకుంటే ఈ భారతదేశములో 95 కోట్ల జనులుంటున్నారు. అందరికి + పెట్టుకుంటే పో. అందరు చేరి ఒక్కటైపోతారు. ఈ ఏకత్వం లేక భిన్నత్వం అభివృద్ధి అయిపోతుంది. ఏకత్వమైతే అందరూ ఆనందస్వరూపులై పోతారు. ఆ unity లో divinity మనకు ప్రాప్తిస్తుంది. మన ప్రేమ ఎలాంటి పరిస్థితియందైనా మార్చుకోకూడదు. ఏవరేమి చెప్పినా మనం జంకు చేయనక్కరలేదు. భయపడనక్కరలేదు. Why fear. ప్రేమ మనలో ఉన్నప్పుడు భయమెందుకు. ప్రేమ లేనివానికే భయముండాలి. తప్పు చేసినవానికి ప్రేమ ఉండదు. ఎవ్వరు భయపడనక్కరలేదు. Don't fear. Why fear when I am here. ఆవిధమైన దివ్యత్వాన్ని మీరు విశ్వసించాలి. వస్తున్నారు, అనేకమంది భక్తులు. కానీ ఎంతమందికి స్థిరమైన భక్తి ఉందో చెప్పటానికి వీలు లేదు. ఒక నిముషంలో నెగిటివ్ రెండవ నిముషములో పాజిటివ్ అవుతారు. నెగిటివ్‌కి ఏమాత్రం అవకాశం యివ్వకూడదు. అంతా పాజిటివ్. ఈ worldly desires అన్ని నెగిటివ్స్. ఈ నెగిటివ్వు చేర్చుకోటం చేత నీ positive పాడైపోతున్నది. కనుక మీరు నిజమైన విషయాన్ని స్థిరమైన భావాన్ని నిశ్చలమైన భక్తిని స్థిరము చేసుకొని భగవంతుని స్మరిస్తూ ఉండండి.

**(తేదీ 26-09-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**